క్లుప్తంగా

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు. మరికొందరు భక్తులు ఆలయ మెట్లకు పసుపు కుంకుమ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రక్షిత నీటి సరఫరాకు చర్యలు



ట్యాంకును శుభ్రం చేస్తున్న కార్మికులు

మద్దికెర: గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ విజయుడు తెలిపారు. ఆదివారం మండల పరిధి లోని ఎం.అగ్రహారం గ్రామంలో మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించారు. నీటి లో బ్లీచింగ్ పౌడర్ కలిపి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.

లైసెన్సు లేకుంటే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ గోపాల్

పత్తికొండ రూరల్: వాహనాలు నడిపే వారికి లైసెన్సుతో పాటు వాహనాలకు సంబంధించిన అన్నీ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్‌ఐ గోపాల్ అన్నారు. ఆదివారం పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతి వాహనదారుడు లైసెన్సుతో పాటు వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ల కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న టెక్నికల్ అసిస్టెంట్లు

పత్తికొండ రూరల్/మద్దికెర: ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌ల పత్తికొండ డివిజన్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పత్తికొండలోని షిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో డివిజన్ పరిధిలోని 9 మండలాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్‌ల సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా మహేష్, ఉపాధ్యక్షుడిగా మారుతి, సెక్రటెరీగా రాముడు, జాయింట్ సెక్రెటరీగా ప్రభాకర్, ట్రెజరర్‌గా సుధాకర్, గౌరవ సలహాదారులుగా నాగన్న, యంకప్ప, ఉలిగెప్ప, క్రిష్ణమూర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, రాముడు మాట్లాడుతూ.. టెక్నికల్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

మహానందిలో సండే సందడి



కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ ఉదయం నుంచి రాత్రి వరకు తగ్గలేదు. ఉదయం ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంతసేవ సమయం వరకు నిర్విరామంగా కొనసాగింది. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కొనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించారు. సెలవు రోజు ఉండటంతో దేవస్థానం పరిధిలోని వసతి గృహాలకు డిమాండ్ పెరిగింది.

కంటి చూపునకు కత్తెర

- సెల్‌ఫోన్, కంప్యూటర్ అతిగా వాడడంతో ఇబ్బందులు
- చిన్నతనంలోనే దృష్టి లోపాలు
- పెరుగుతున్న దూరదృష్టి సమస్య
- కంటి వైద్యుల వద్దకు క్యూ కడుతున్న యువత



మొబైల్, ల్యాప్‌టాప్‌ను చూస్తున్న యువతి (ప్రతీకాత్మక చిత్రం)

ఆదోని అర్బన్: సెల్‌ఫోన్ నేడు నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ఎవరి చేతిలో చూసినా ఫోన్ కనిపిస్తోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ ఫోన్‌ను వినియోగిస్తున్నారు. ఇంట్లోనూ, బయట పది మంది కలిసిన చోటు, చివరికి భోజనం చేసే సమయంలోనూ సెల్‌ఫోన్ చూడడంలో నిమగ్నమవుతున్నారు. గంటల తరబడి మొబైల్ చూడడంతో కంటి సమస్యలు ఎక్కువగా వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. ముఖ్యంగా మొబైల్ నుంచి వచ్చే నీలి కాంతి కిరణాలు కంటిపై ప్రభావం చూపుతాయని, దీంతో కంటిచూపు దెబ్బ తినే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ మేరకు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంటి వైద్యనిపుణుడు పద్మకుమార్ యువతకు జాగ్రత్తలు, కంటి చూపును కాపాడుకునేందుకు చర్యలను వివరించారు

ఒకప్పుడు పగలంతా పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత చీకటి పడగానే భోజనం తినేసి నిద్రకు ఉపక్రమించేవారు. ఇప్పుడు ప్రజల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. రాత్రి 11 గంటల వరకు టీవీలు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్‌లు, ల్యాప్‌టాప్‌లకు అతుక్కుపోతున్నారు. 60 శాతం ప్రజలు రోజులో 5 నుంచి 6 గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తున్నారు. యువత సెల్‌ఫోన్‌ను వినియోగించే సమయం మరింత ఎక్కువగా ఉంటోంది. ఇలా సెల్‌ఫోన్‌కు బానిస కావడం వల్ల చేతివేళ్లు తరచూ సెల్‌ఫోన్‌పైకి వెళ్తుంటాయి. చిన్నపిల్లలు సైతం ఫోన్‌కు అలవాటు పడ్డారు. గతంలో సూర్యుడి కాంతి మాత్రమే కళ్లపై పడేది. ఇప్పుడు సెల్‌ఫోన్లు, టీవీల నుంచి వచ్చే కృత్రిమ కాంతిలో ఉండే బ్లూ లైట్ కంటిపై ఎక్కువగా పడుతుంది. దీనివల్ల కంటికి కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. చిన్న వయస్సులోనే కంటిజబ్బు బారిన పడి ఆస్పత్రుల బాట పడుతున్నారు.

కంప్యూటర్ విజన్ సిండ్రోమ్

కంప్యూటర్ విజన్ సిండ్రోమ్‌ను డిజిటల్ ఐ స్ట్రేన్ అంటారు. ఇది ఎక్కువ కాలం కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు చూడడం వల్ల వస్తుంది. కళ్లు ఒత్తిడికి గురికావడం, అలిసిపోవడం, కళ్ల మంటలు, ఎరుపు కావడం, ఒక వస్తువు రెండుగా కనిపించడం, కళ్లు పొడిబారడం, నల్లగుడ్డు పొరబాడడం లాంటి లక్షణాలు ఉంటాయి.

కారణాలు

డిజిటల్ పరికరాలను విస్తృతంగా వినియోగించడం, రెండు గంటల కన్నా కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను తదేకంగా చూడడం, కంప్యూటర్‌లో అక్షరాలను తదేకంగా చూడడం వల్ల కళ్లు ఒత్తిడికి గురవుతాయి. స్క్రీన్ కాంట్రాస్ట్ ఎక్కువగా ఉండడం, సాధారణంగా నిమిషానికి 18 నుంచి 20 సార్లు రెప్ప వాల్చాలి. కానీ కంప్యూటర్ చూసే వారికి ఇది మూడు నుంచి ఆరు సార్లకు పడిపోతుంది. దీనివల్ల కళ్లల్లోని ఉపరితలం పొడిబారుతుంది.

చికిత్స, నివారణ

కళ్లకు తేమ కలిగించేలా కృత్రిమంగా ఐడ్రాప్స్ వాడడం, కళ్ల రెప్పలను తరుచుగా మూయడం, దృష్టి లోపాలకు వాడే అద్దాలు, బ్లూ ఫిల్టర్ ఉండేలా చూడడం, స్క్రీన్ టైం తగ్గించుకోవడం, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను 20 సెకన్ల పాటు వీక్షించడం, కంప్యూటర్, సెల్‌ఫోన్ స్క్రీన్ బ్రైట్‌నెస్ కాంట్రాస్ట్‌ను సర్దుబాటు చేసుకోవడం, కంప్యూటర్, సెల్‌ఫోన్‌లో అక్షరాలను పెద్దవిగా చేసుకోవడం, సంవత్సరానికి ఒకటి రెండుసార్లు ఐ స్పెషలిస్ట్‌ను కలిసి చికిత్సలు చేయించుకోవాలి.

బ్లూ లైట్లతో కళ్లకు ప్రమాదం

మొబైల్ ఫోన్‌లో ఉండే నీలికాంతి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ కాంతి ఎక్కువగా పెట్టుకుని చూడడం వల్ల వాటిలోని రేడియేషన్, అల్ట్రావైలెట్ కిరణాల వల్ల కళ్లల్లో నీరు ఇంకిపోయి పొడిబారుతాయి. విద్యార్థులు, యువకులు మొబైల్ కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను దగ్గర నుంచి చూడడం వల్ల క్రమంగా వారికి దూరంగా ఉన్నవి కనిపించవు. సాధారణంగా దృష్టి లోపం ఉండే వారిలో ఏడాది నుంచి రెండేళ్లకు వారి కంటి అద్దాల నంబర్ మారుతుంది. కానీ ఎక్కువసేపు ఆన్‌లైన్ క్లాసుల కారణంగా తక్కువ సమయంలోనే కంటి అద్దాల నంబర్ మారుతుంది. దీనికితోడు వర్క్‌ఫ్రం హోం, ఆన్‌లైన్ క్లాసుల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మానిటర్లను చూడడం వల్ల కంటి కండరాలపై ఒత్తిడి పెరిగి సాయంత్రం వేళ తలనొప్పి వస్తుంది.

కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రతి అరగంటకోసారి మొబైల్, కంప్యూటర్, ల్యాప్‌టాప్ నుంచి రెండు నుంచి మూడు నిమిషాల పాటు దృష్టిని వేరేవైపు మరల్చాలి.
- కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగులాల దూరం ఉంచాలి.
- యాంటీ గ్లేర్, యాంటీ రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి.
- కళ్ల మంటలు, నీరు కారడం వంటి సమస్యలు ఉంటే కాసేపు మానిటర్‌ను చూడడం ఆపేయాలి.
- తరచూ చల్లని నీటిని కళ్లతో కడుక్కోవాలి.
- రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడి బట్టను ఉంచాలి.
- కంటికి కసరత్తులు సైతం అవసరం. కళ్లను కుడి, ఎడమకు అర నిమిషం నుంచి ఒకనిమిషం వరకు తిప్పాలి.
- రెండు అరచేతులను రుద్దుకొని వేడెక్కిన తర్వాత కళ్లపై ఉంచే కసరత్తు చేయాలి.

ఎక్కువసేపు సెల్‌ఫోన్‌ను చూడరాదు



కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను ఎక్కువ సేపు చూడడం వల్ల అందులోని నీలికాంతి కళ్లపై పడి కళ్లు దెబ్బతింటాయి. కంటి జబ్బులతో వస్తున్న వారిలో కళ్లు పొడిబారడం, ఎర్రగా కావడం, మంటలు రావడం, దురద వంటి సమస్యలు ఉంటున్నాయి. మొబైల్ ఫోన్‌లను దూరంగా ఉంచాలి. కంప్యూటర్, మానిటర్‌లను ఎక్కువసేపు చూడడం మానుకోవాలి. లేకపోతే కంటి జబ్బులు తీవ్రమవుతాయి. కంటి చూపు కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటించాలి. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్ అలవాటు చేయవద్దు.

– డాక్టర్ పద్మకుమార్, కంటి వైద్యనిపుణుడు, ఆదోని జనరల్ ఆస్పత్రి

కన్నడ, ఉర్దూ లాంగ్వేజ్‌లను కొనసాగించాల్సిందే

- విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా సంఘాల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు

హొళగుంద: కన్నడ, ఉర్దూ విద్యార్థులు ప్రాథమిక విద్యను ముగించుకుని హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతికి చేరేందుకు వస్తే అనుమతి నిరాకరణ చేయడం సబబు కాదని.. వారికి న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, కన్నడ, ఉర్దూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. సీబీఎస్‌ఈని ప్రవేశపెట్టడం మంచిదే అయితే సెకండ్ లాంగ్వేజ్ కింద తెలుగు తప్పా కన్నడ, ఉర్దూను కొనసాగించకపోవడం దారుణమన్నారు. హొళగుంద గ్రామం కర్ణాటక రాష్ట్రం సరిహద్దున ఉండడం, ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉండడం వల్ల ఇక్కడి విద్యార్థులు ఆయా మీడియంను అధిక సంఖ్యలో చదువుతున్నట్లు వివరించారు. సీబీఎస్‌ఈ పేరిట ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే విద్యార్థులు చదువుకోలేరని, మధ్యలో బడి మానేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేయొద్దని కోరారు. సెకండ్ లాంగ్వేజ్‌ల కింద కన్నడ, ఉర్దూకు అవకాశం కల్పించాలని లేదా కన్నడ, ఉర్దూ మీడియంలను అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. శివన్నగౌడ్, ఈశా, గవిసిద్ధప్ప, రుద్రగౌడ్, దొడ్డబసప్ప, కన్నారావు, సుబాన్, హమీద్, ఇర్ఫాన్, మురళి, తోక వెంకటేష్, షబ్బీర్, ధనుంజయ, గాదిలింగప్ప తదితరులు ఉన్నారు.

బతుకుదెరువు కోసం వచ్చి మృత్యుఒడిలోకి..

- ట్రాక్టర్ కింద పడి జార్ఖండ్ యువకుడి మృతి



బోకుల్ సింకు మృతదేహం

కృష్ణగిరి: బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకుని జార్ఖండ్ నుంచి వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఎస్‌ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం హట్‌గమాసియా జిల్లా నుంచి కొందరు వ్యక్తులు లక్కసాగరం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి అనే కంట్రాక్టర్ వద్ద కరెంటు పనులు చేసేందుకు 5 నెలల కింద వచ్చారు. వీరు కంబాలపాడు గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉంటూ రోజు కరెంటు పనులకు వెళ్లేవారు. శనివారం సాయంత్రం బోకుల్ సింకు(20), దున్నై అనే వ్యక్తితో కలిసి ట్రాక్టర్(ఏపీ39వీఏస్3488)ను తీసుకుని కంబాలపాడు నుంచి పెనుమాడకు వెళ్లారు. అక్కడున్న బావి వద్ద ఎత్తయిన ప్రదేశంలో ట్రాక్టర్ ఉంచి కట్టెలు లోడ్ చేస్తున్నారు. కుదుపులకు బోకుల్ సింకు కింద పడడం.. అదే సమయంలో ట్రాక్టర్ అతనిపై వెళ్లడంతో మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.





రహదారి విస్తరణలో కూల్చివేసిన ఇల్లు, మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌సింగ్

ఆక్రమణల తొలగింపు

దేవనకొండ: మండలంలోని జిల్లెడబుడకల గ్రామంలో రహదారి విస్తరణలో భాగంగా గ్రామంలోని శాలుమియా, భక్తయ్య, పెద్దరంగస్వామి, మక్బుల్ తదితరుల ఇళ్లను పంచాయతీ అధికారులు ఆదివారం కూల్చి వేశారు. రోడ్డు ఆక్రమణలపై మే 31వ తేదీ సదరు ఇళ్ల యజమానులకు పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్ నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆదివారం రహదారిపై అక్రమంగా నిర్మించిన అరుగు, కట్టలు, ఇళ్లను కూల్చివేసినట్లు పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌సింగ్ తెలిపారు. దీనిపై బాధితుడు రామాంజనేయులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

'పది' తరువాతే ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టాలి

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి తరువాతే ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని ఏఐడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఎస్‌కే మొబీన ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇటీవల 9వ తరగతి నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం విడుదల చేసిన నోట్‌ను ఆమె తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రపంచమంతా అంగీకరించిన విద్యా సూత్రం ప్రకారం 10వ తరగతి వరకు విద్యార్థులకు ప్రకృతి, సమాజం వంటి మౌలిక విషయాలతోపాటు భాషలు, సాహిత్య అధ్యయనాన్ని అలవాటు చేసి వ్యక్తిత్వ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాయన్నారు. అలాకాకుండా 9వ తరగతి నుంచి ఒకేషనల్ కోర్సులను చదివేలా ప్రణాళికలు రూపొందించడం మంచికాదన్నారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

చిరుమాన్‌దొడ్డిలో తాగునీటి సమస్య



ట్యాంకుల వద్ద నీటి కోసం వేచి ఉన్న గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి సరఫరా చేసే బోర్లు నుంచి వచ్చే నీరు సరిపోకపోవడంతో నాగనాథహళ్లి రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిపైనే ఆధారపడ్డామని గ్రామస్తులు చెబుతున్నారు. నాగనాథహళ్లి రిజర్వాయర్ నుంచి పది రోజులకోసారి వస్తుండడంతో నీటి కోసం నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి



వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు: నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. ఆదివారం చిప్పగిరిలోని ఎమ్మెల్యే గృహంలో ఆలూరు, గూళ్యం, హాలహరివ్, మూసనపల్లి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చిన్నహోతూరు గ్రామ చెరువు నీటిని ఆయకట్టు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని మూసాపనపల్లి మాజీ సర్పంచ్ సోమశేఖర్, గ్రామస్తులు మల్లికార్జున, హరిప్రసాద్, శ్రీనివాసులు కోరారు. అదే విధంగా కమ్మరచేడు, కాత్రికి, మూసానపల్లి, గూళ్యం గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు.


శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులు



పత్తికొండలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పత్తికొండ రూరల్: బీజేపీ మూలపురుషుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 79వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పత్తికొండలోని పబ్లిక్ రీడింగ్ రూం ఆవరణలో పార్టీ నేతలు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్‌మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జి సీసీ రంగన్న మాట్లాడుతూ.. శ్యాంప్రసాద్ ముఖర్జీ జన సంఘ్‌ను ఏర్పాటు చేసి బీజేపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కలకత్తా విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా, బెంగాల్ ఆర్థిక మంత్రిగా, జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో పరిశ్రమల మంత్రిగా ప్రజలకు సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శంకరయ్యాచారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండి మల్లికార్జున, నాయకులు పూనా మల్లికార్జున, రామ్మోహన్, గోవర్ధన్ నాయుడు, కరణం చంద్రన్న పాల్గొన్నారు.


కోగిలతోటలో పారిశుద్ధ్య పనులు



డ్రైనేజీ కాలువలో పూడిక తీస్తున్న కార్మికుడు

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట గ్రామంలో దోమలు, సీజనల్ వ్యాధుల నివారణకు సర్పంచ్ యాట గురుపాదమ్మ చర్యలు తీసుకున్నారు. ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయించారు. హొళగుంద, గూళ్యం రోడ్లతో పాటు ప్రధాన వీధుల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు నీటిని తొలగించారు. చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల వద్ద హంద్రీ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న కృష్ణగిరి మండలానికి చెందిన మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు కోడుమూరు ఎస్‌ఐ బాల నరసింహులు ఆదివారం తెలిపారు. అనుమతుల్లేకుండా హంద్రీ నది నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలించరాదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని ఎస్‌ఐ హెచ్చరికలు జారీ చేశారు.



దుస్థితికి చేరుకున్న ఏరూరు రోడ్డు



రామదుర్గంలో..

గుంతలమయంగా గ్రామీణ రహదారులు

చిప్పగిరి: మండలంలోని గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారాయి. ముఖ్యంగా దౌల్తాపురం, నంచర్ల, ఏరూరు, డేగులహాలు, రామదుర్గం, నేమకల్లు, తిమ్మాపురం, సంగాల తదితర గ్రామాల రోడ్లు రాళ్లు తేలి వాహనదారులకు నరకం చూపుతున్నాయి. అధికారులు స్పందించి నూతన రోడ్లు వేయాలని.. లేకుంటే కనీసం మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నేమకల్లు రోడ్డు

కుంగిన సీసీరోడ్డు



తుగ్గలిలో కుంగిన మెయిన్ రోడ్డు

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి మెయిన్ రోడ్డు కుంగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 25 ఏళ్ల క్రితం మెయిన్ రోడ్డులో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇటీవల కాలంలో అధిక లోడ్డుతో భారీ వాహనాలు తిరుగుతుండడంతో చాలా చోట్ల రోడ్డు చీలికలతో కుంగిపోయింది. సీసీ రోడ్డుకు ఓవైపు డ్రైనేజీ కూడా లేక ఇళ్లలో నుంచి వచ్చే వృథా నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ రహదారిపై రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం అధికారులు, పాలకులు ఈ రోడ్డు ప్రయాణిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి తీగ చోరీ



దుండగులు ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెద్దకడబూరు: గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని నౌలేకల్లు పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రైతులు సుభాన్, ఈడిగ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ ధంసంమై పడిఉంది. అందులోని రాగి తీగను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే లైన్‌మెన్ అంజికి ఫోన్ ద్వారా సమాచారం చేరవేసినట్లు తెలిపారు. లైన్‌మెన్ ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పంట రుణాలను రెన్యూవల్ చేసుకోండి

తుగ్గలి: పంట రుణాలు తీసుకున్న రైతులు గడువులోగా రెన్యూవల్ చేసుకోవాలని ఉప్పర్లపల్లి, మారెల సొసైటీ సీఈఓలు గిడ్డయ్య, మనోహర నాయుడు కోరారు. ఇందు కోసం వన్‌బీ, ఆధార్, పాసుపుస్తకం జిరాక్సు కాపీలను సొసైటీలో అందజేయాలన్నారు. గడువులోగా రుణాలు రెన్యూవల్ చేసుకుంటే ప్రభుత్వ ప్రయోజనాలకు అర్హులవుతారని తెలిపారు. అలాగే దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు కంతులు చెల్లించాలని కోరారు.